క్లుప్తంగా

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు


సూచనలిస్తున్న సీఐ నారాయణ రెడ్డి

కదిరి టౌన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణ సీఐ డి.వి.నారాయణరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణంలోని ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడుబండ్ల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మున్సిపాలిటీ వారు నిర్ణయించిన ప్రాంతంలో తోపుడు బండ్లు పెట్టుకోవాలని ఫుట్‌పాత్ వ్యాపారస్తులు, తోపుడు బండ్ల యజమానులకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో అఖండ రామభజన


భజన చేస్తున్న దృశ్యం

ఎన్‌పీకుంట: ఎన్.రెడ్డివారిపల్లిలోని రామాలయంలో శనివారం అఖండ రామభజన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో శనివారం అఖండ రామభజన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగానే శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ భజన చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వంకమద్ది, కొత్తపల్లి, నల్లగుట్లపల్లి గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొన్నాయి.

జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ధర్మవరం అర్బన్: కళాశాలలో చేరిన జూనియర్ విద్యార్థినులు సీనియర్ విద్యార్థినులతో స్నేహభావంతో మెలుగుతూ విద్యలో రాణించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్ సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు పల్లెం వేణుగోపాల్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, కొత్తచెరువు కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

పోలీసుల బందోబస్తు మధ్య ఎస్‌ఎంసీ ఎన్నికలు


జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలుర పాఠశాల వద్ద బందోబస్తు చేపట్టిన పోలీసులు

బత్తలపల్లి: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలుర పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలను తలపించాయి. ఈనెల 8వ తేదీన కూటమి నేతల మధ్య ఘర్షణ కారణంగా కోరం లేదని ఎన్నికలు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఎస్‌ఎంసీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీడీపీ మండలంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాఠశాల వద్దకు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీలోనే రెండు వర్గాలు చైర్మన్ పదవులకు పోటీ పడ్డారు. ఇరువర్గాల మధ్య చర్చల అనంతరం మండల టీడీపీ నేతలు సూచించిన డి.చెర్లోపల్లికి చెందిన శివశంకర్‌ను చైర్మన్‌గా, తెలుగు యువత నాయకుడు తాళ్లూరు సతీష్ కుమార్ సూచించిన గంటాపురంకు చెందిన లక్ష్మీదేవిని వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు అధికారులు ప్రతి తరగతి నుంచి విద్యార్థుల తల్లిదండ్రులలో ముగ్గురు సభ్యుల చొప్పున 18 మందిని ఎన్నుకున్నారు. వీరిలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎంపిక చేసి వారితో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ధర్మవరం ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్ నాయక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవరకొండ మాధవి తదితరులు పాల్గొన్నారు.


చెన్నేకొత్తపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవంక


ధర్మవరం రూరల్: కుణుతూరు వద్ద ప్రవహిస్తున్న వంక


ధర్మవరం రూరల్: గొట్లూరు చెరువులోకి చేరుతున్న నీరు

భారీ వర్షం.. రైతన్నల హర్షం

- విస్తారంగా కురిసిన వర్షం
- వాగులు, వంకలకు జలకళ

ధర్మవరం రూరల్: ధర్మవరం వ్యవసాయ సబ్ డివిజన్‌లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పోతులనాగేపల్లి సమీపంలోని చిత్రావతి నది పరవళ్లు తొక్కింది. నదీ పరివాహక గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిత్రావతి ప్రవహించడంతో బోరుబావుల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని రైతులు చెబుతున్నారు. ధర్మవరం మండలంలో 54.6 మి.మీ, బత్తలపల్లి మండలంలో 64.2 మి.మీ, తాడిమర్రిలో 76.8 మి.మీ, ముదిగుబ్బలో 82.4 మి.మీ, కనగానపల్లిలో 54.2 మి.మీ, చెన్నేకొత్తపల్లిలో 86.4 మి.మీ, రామగిరిలో 62.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

నల్లచెరువులో..

నల్లచెరువు: మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. పలు కాలనీల్లోని రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. పూలకుంట రోడ్డు అలాగే ఓరువాయి రోడ్డులోని రైల్వే గేట్ వద్ద రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పొంగిన వాగులు, వంకలు

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 76.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ సౌమ్య తెలిపారు. తాడిమర్రి, కునుకుంట్ల, రామాపురం, చిల్లవారిపల్లి, పెద్ద కోట్ల, చిల్లకొండయ్యపల్లి, మద్దులచెరువు, బీమరాయునిపేట, పుల్లా నారాయణ పల్లి గ్రామాల సమీపంలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి.

కనగానపల్లిలో 54.6 మి.మీ వర్షం

కనగానపల్లి: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండల కేంద్రం కనగానపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో సుమారు 54.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు. కనగానపల్లి, కుర్లపల్లి, దాదులూరు, ముక్తాపురంతో పాటు పలుచోట్ల వాగులు, వంకలు పారడంతో నీటి కుంటలు, చెరువుల్లోకి నీరు చేరింది. ఈ ఖరీఫ్‌లో రెండు నెలల తర్వాత వర్షాలు బాగా కురుస్తుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఉధృతంగా ప్రవహించిన 'చిత్రావతి'

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెన్నేకొత్తపల్లి నుంచి వెంకటంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న పెద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఉదయం తొమ్మిది గంటల వరకు వంకను దాటలేక పోయారు. అలాగే మండలంలోని చిన్నపురెడ్డిపల్లి గ్రామం వద్ద చిత్రావతి నది ఉధృతంగా వంతెనపై ప్రవహించింది. ధర్మవరం పుట్టపర్తి రహదారిలో చెన్నేకొత్తపల్లి మండలం సరిహద్దులో ఉన్న వంగపేరు నీటితో కళకళలాడింది. వంకలో నీరు ప్రవహించడంతో పుట్టపర్తి నుంచి ధర్మవరానికి వెళ్లే బస్సులను పెనుకొండ వైపునకు దారి మళ్లించారు. మండలంలో వర్షం కారణంగా ఎక్కడా నష్టం జరగలేదని ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనురాధ తెలిపారు.


చెన్నేకొత్తపల్లి: చిన్నపురెడ్డిపల్లి వద్ద వంతెనపై ప్రవహిస్తున్న చిత్రావతి నది


కనగానపల్లి మండలం కుర్లపల్లి వద్ద కుంటలోకి చేరిన వర్షపు నీరు

అనారోగ్యంతో కండక్టర్ మృతి


చెన్నలక్ష్మి (ఫైల్)

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న చెన్నలక్ష్మి (59) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమె గత కొంతకాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నారు. బెంగళూరులోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కన్ను మూశారు. మృతురాలికి ఒక కుమార్తె ఉంది. అంత్యక్రియలకు డీఎం మైనుద్దీన్ రూ.15 వేలు తక్షణ సాయం అందజేశారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు ఎన్‌వీ రమణ, బైరిశెట్టి, విశ్రాంత ఉద్యోగులు నరసింగరావ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వైద్య శిబిరం తనిఖీ


ఓపీ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్ర

నల్లచెరువు: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శనివారం కదిరి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిష్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ కల్పన రెడ్డి సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణ రెడ్డి, ముస్తఫా ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు దుర్మార్గం


తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌లో నిరసన తెలుపుతున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది


ధర్మవరం అర్బన్: పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు


ముదిగుబ్బలో నినాదాలు చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం దేశవ్యాప్త నిరసన చేపట్టారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఆర్డీటీ ఆసుపత్రిలో వైద్య సేవలు నిలిపివేశారు. అత్యవసర సేవలకు మినహాయింపు ఇచ్చారు. ఆర్డీటీ ఆసుపత్రి నుంచి బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. కూడలిలో మానవహారంగా నిల్చుకొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, వైద్యులు సుధీర్, హరీష్, దశరథరామ్, జ్యోతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగిరెడ్డి, సరస్వతి, రాజశేఖర్‌లతో పాటు ఆర్డీటి సుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: వైద్య సిబ్బందిపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. వైద్యురాలిని హత్యాచారం చేసిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యమంలో ఏపీ ఎన్‌జీఓ కదిరి ప్రెసిడెంట్ వి.వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ప్రసిడెంట్ మహబూబ్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్రరెడ్డి, సురేంద్ర నాయక్, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిని హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. కదిరి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వేమారెడ్డి సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, మున్సిపల్ కార్యాలయం మీదుగా కదిరి తహసీల్దార్ కార్యాలయం వరకు వైద్యులు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ సీవీ.మదన్ కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, ట్రెజరర్ డాక్టర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో శనివారం వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది నల్లబ్యాడ్జీతో నిరసన తెలిపారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగిస్తామని వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ సావిత్రమ్మ, హెల్త్ అసిస్టెంట్లు మోహన్‌రెడ్డి, ముసల్‌రెడ్డి, సుబ్రమ్మణ్యం, ఏఎస్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆర్‌ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని భారతీయ వైద్య సంఘం ధర్మవరం శాఖ అధ్యక్షుడు జయకుమార్, కార్యదర్శి వాసుదేవరెడ్డి, కోశాధికారి మదన్‌మోహన్, ఐఎంఏ రాష్ట్రశాఖ పూర్వ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి కోరారు. ఐఎంఏ పిలుపు మేరకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ఓపీలను బంద్ చేసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. పురవీధుల్లో ర్యాలీ చేస్తూ కాలేజీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వైద్యుల కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సుబ్బారావు, నరసింహులు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వియా సాల్మన్, నజీర్, వెంకటేషులు, వైష్ణవి, సురేఖ, అనిల, వివేక్, విక్రమ్, అజయ్‌బాబు, సోనియా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల తహసీల్దార్‌గా రవినాయక్



తలుపుల: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రవినాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎన్‌పీకుంట డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని తహసీల్దార్ తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

తనకల్లు: రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ తీసుకుని ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రంలో పని చేస్తున్న సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

తొగటవీర క్షత్రియ సంఘం పట్టణ అధ్యక్షుడి రాజీనామా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తొగటవీర క్షత్రియ సంఘం పట్టణ అధ్యక్షుడు బండారు ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి శంకర్ యుగంధర్ శనివారం తమ పదవులకు రాజీనామా చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు విలేకరులతో మాట్లాడారు. తమ పదవీకాలం పూర్తికావడంతో రాజీనామా చేస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన కులస్తులు అధ్యక్ష పదవి చేపట్టి తొగటవీర క్షత్రియ సేవా సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఎమర్జెన్సీ రోగులకే వైద్యం


ఓపీ చీటీలు రాస్తున్న ఆసుపత్రి సిబ్బంది

ధర్మవరం అర్బన్: దేశ వ్యాప్తంగా వైద్యులు ఓపీ సేవలను బంద్ చేసి నిరసన ర్యాలీలకు దిగారు. దీంతో రోగులు పలు ఇబ్బందులకు గురయ్యారు. ధర్మవరం పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం కేవలం ఎమర్జెన్సీ ఉన్న రోగులకు మాత్రమే ఆసుపత్రి సిబ్బంది ఓపీ చీటీలు రాసి ఇచ్చారు. సాధారణ ఓపీ రోగులకు వైద్య సేవలు నిలిపివేశామని వెనక్కి పంపించారు. రోగులు కాసేపు ఆసుపత్రి ఆవరణలో కూర్చుని వెనుదిరిగి వెళ్లారు.

బుక్కపట్నం పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్


సైన్స్ పుస్తకాలను చూపుతున్న దృశ్యం

పుట్టపర్తి: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ర్యాడ్స్ సంస్థ అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి సూచించారు. శనివారం బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మోటార్ వాహనాల సంఖ్య పెరగడంతో వాతావరణం కాలుష్యం అవుతోందన్నారు. కాలుష్యం నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సంస్థ అడ్వైజర్ తలమర్ల సంజీవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయుడు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.


హెడ్ పోస్టాఫీసులో ఆధార్ కేంద్రం ఏర్పాటు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసులో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు రాజేష్, నింగేష్ తెలిపారు. శనివారం స్థానిక పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన సమాశంలో వారు విలేకరులతో మాట్లాడారు. బాల ఆధార్ ఉచితంగా తీయడం జరుగుతుందని తెలిపారు. బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ నవీకరణ, చిరునామా మార్పు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మండల ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ కమ్మన్న, ఎంఓ బుడ్డన్న, పూజిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

అమడగూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు సమావేశం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల వ్యాప్తంగా చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించారు. వారం రోజుల పాటు ఉపాధి పనులను పరిశీలించి గ్రామసభలు నిర్వహిస్తారు. అనంతరం మండల కేంద్రంలో సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేసి, ఉపాధి పనుల వివరాలు, ఖర్చు చేసిన నిధులను వెల్లడిస్తారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఏఈఈ పీఆర్ గుప్తా, ఏపీఓ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ


ఎన్‌పీకుంట: ధనియాని చెరువులో పూజలందుకున్న ఆంజనేయుడు


గాండ్లపెంట: షిర్డీ సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


తలుపుల: ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సాక్షినెట్‌వర్క్: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో శనివారం శ్రావణమాసం సందడి నెలకొంది. ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో ఆంజనేయుడికి ఆకుపూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గాండ్లపెంట మండలం వేపరాల గ్రామ సమీపంలో షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా బాబా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. మూడు రోజుల పాటు పూజలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. భక్తులకు మూడు రోజుల పాటు అన్నదానం చేస్తామని పేర్కొన్నారు. బత్తలపల్లి మండలం పోట్లమర్రి ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ చేశారు. శ్రావణమాసంలో సిరితో పాటు సంపదలు కలగాలని కోరుతూ మండలంలోని మహిళలు ఆయా దేవాలయాల్లో పూజలు చేపట్టారు. అలాగే అమడగూరు, తలుపుల, గాండ్లపెంట, బత్తలపల్లి ఎన్‌పీకుంట, తాడిమర్రి, ధర్మవరం మండలంలోని ఆలయాల్లో పూజలు జరిగాయి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చిన్నపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్టోత్సవం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా వేద పండితులు ఆలయంలో హోమాలు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం ఆలయంలో సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామ చంద్రస్వామి విగ్రహాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య ప్రతిష్ట గావించారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో సీడబ్ల్యూసీ సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కేటీ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

బత్తలపల్లి: వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు, గ్రామ పెద్దలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. శనివారం ఎం.చెర్లోపల్లి గ్రామంలో విరాటపర్వం చదువుతూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రామస్వామి దేవాలయంలో బండ్లపల్లి శంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, చిల్లవారిపల్లి నాగశివారెడ్డి తదితరులు విరాటపర్వం చదివారు. భజన బృందాల ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. ఈదుల ముష్టూరులో వర్షం కోసం కాటమయ్య స్వామికి గ్రామోత్సవం చేపట్టారు.

మెగా సప్లిమెంటరీకి 30లోపు ఫీజు చెల్లించాలి

కదిరి అర్బన్: శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో 2015-16 నుంచి 2018-19 వరకూ బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు రాసుకునేందుకు యూనివర్సిటీ అనుమతి ఇచ్చిందని స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.స్మిత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 30న ఆఖరు తేదీ అని తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన పాలపాటి దిన్నె

నల్లచెరువు: శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.